క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీ హోమం


చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో మార్గశిర మాసం మంగళవారం సందర్భంగా భవానీ మాలధారుల ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. భవానీ గురుస్వాములు సూరిబాబు, టైలర్ రాముడు ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా చండీ హోమం, విశేష పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఏఎస్ఐగా బాధ్యతల స్వీకరణ


వెంకటేశ్వర్లు

కోవెలకుంట్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 25 మందికి ఉద్యోగాలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధి

ప్యాపిలి: స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 25 మందికి ఉద్యోగాలు లభించాయి. మొత్తం 32 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మూడు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి త్వరలోనే సమాచారం ఇస్తామన్నారు. కోఆర్డినేటర్ గోపినాథ్, నాగవిఘ్నేశ్వర్ రెడ్డి, నేషనల్ కెరీర్ సర్వీస్ ఇన్‌చార్జ్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు ఇన్వర్టర్ వితరణ


పాఠశాలకు ఇన్వర్టర్‌ను అందజేసిన దాతలు

ప్యాపిలి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఇన్వర్టర్‌ను బహూకరించారు. ఇటీవల జరిగిన పీటీఎంలో విద్యుత్ కోతల సమయంలో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నట్లు హెచ్‌ఎం ప్రియాంక విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. స్పందించిన పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు ఇన్వర్టర్‌ను కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు. అలాగే పట్టణానికి చెందిన దేవీ దయానంద్ సింగ్, మనోరమ తదితరులు 20 ఎల్ఈడీ బల్బులు అందజేశారు. దాతలకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు


గోదాదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు

డోన్: ధనుర్మాసం రెండో రోజు మంగళవారం స్థానిక వేంకటేశ్వర ఆలయంలో గోదాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే పెద్దసంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాముశర్మ ధనుర్మాస మహత్యం గురించి భక్తులకు వివరించారు. ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీబాయి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం అందజేస్తున్న ఇందిరమ్మ

బనగానపల్లె రూరల్: స్థానిక పంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, స్వచ్ఛభారత్ సిబ్బందికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ చేతుల మీదుగా మంగళవారం యూనిఫాం పంపిణీ చేశారు. మంత్రి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 121 మందికి అందజేశారు. ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రణాళిక
- ఉదయం, సాయంత్రం వేళల్లో స్టడీ అవర్స్

టార్గెట్.. టెన్


మోడల్ స్కూల్ స్టడీ అవర్‌లో విద్యార్థులు

కొలిమిగుండ్ల: విద్యార్థులకు పదో తరగతి ఎంతో కీలకమైంది. ఇక్కడ నేర్చుకునే విషయాలు, వచ్చే మార్కులు భవిష్యత్తును నిర్ణయిస్తుంది. పబ్లిక్ పరీక్షలు కావడంతో తప్పక ఉత్తీర్ణ సాధిస్తేనే పైతరగతులకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. పబ్లిక్ పరీక్షలు అంటేనే విద్యార్థుల్లో భయం ఏర్పడుతుంటుంది. 2025 మార్చిలో జరగబోయే టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పాగొట్టి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళిక తయారు చేశారు. డిసెంబర్ ఒకటో తేది నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. మార్చి 17 నుంచి 31 వరకు పబ్లిక్ పరీక్షలు జరగనుండడంతో ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. రోజు ఉదయం 8గంటల నుంచి 9వరకు, సాయంత్రం 4గంటల నుంచి 5వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతులు, సెలవు దినాల్లో సైతం తరగతులు నిర్వహిస్తున్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పబ్లిక్ పరీక్షలకు మూడు నెలలు సమయం మాత్రమే ఉండడంతో ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై దృష్టి సారించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు. చాలా పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల సమస్య ఏర్పడడంతో ఉన్న టీచర్లతోనే బోధన సాగించాల్సి వస్తోంది. పదోన్నతులు, పదవీ విరమణ చేయడంతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలు ఏర్పడ్డాయి. విద్యాశాఖ అధికారులు సర్దుబాటు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో 54 ఉన్నత పాఠశాలలు ఉండగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 3,365 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం 8గంటలకే స్టడీ అవర్‌కు చేరుకోవాలంటే రవాణతో పాటు అల్పాహారం తీసుకోకుండా రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

పరీక్షల వరకు పాఠశాలలో అల్పాహారం ఏర్పాటు చేయాలని తల్లితండ్రులు కోరుతున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో బాగా చదివే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మంచి మార్కులు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. డీగ్రేడ్ విద్యార్థులను దత్తత తీసుకొని కనీస మార్కులతో ఉత్తీర్ణత అయ్యేలా చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

నియోజకవర్గంలో విద్యార్థుల వివరాలు

మండలం	ఉన్నత పాఠశాలలు	టెన్త్ విద్యార్థులు
కొలిమిగుండ్ల	12	575
అవుకు	12	530
సంజామల	08	359
కోవెలకుంట్ల	08	748
బనగానపల్లె	14	1153

స్టడీ అవర్స్ ఉపయోగపడుతున్నాయి



ఉదయం, సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ బాగా ఉపయోగపడుతున్నాయి. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో 550 మార్కులకు పైగానే సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నాను. ఉపాధ్యాయుల ప్రోత్సాహం బాగుంది. ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. రోజుకో సబ్జెక్ట్ చొప్పున స్టడీ అవర్స్ జరుగుతున్నాయి. **–రమ్య, టెన్త్ విద్యార్థిని**

మంచి ఫలితాలు సాధించేందుకు కృషి



పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకుపోతున్నాం. ఇప్పటికే రోజుకో ఉపాధ్యాయుడిని టైం టేబుల్ ప్రకారం నియమించి స్టడీ అవర్స్ ఏర్పాటు చేస్తున్నాం. స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నాం. వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. **–సంజీవరెడ్డి, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్**

పర్యవేక్షణ చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహణపై పర్యవేక్షణ చేస్తున్నాం. విద్యాశాఖ ఇచ్చిన 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. పరీక్షల సమయం తక్కువ ఉండడంతో తల్లితండ్రులు విద్యార్థులను సెలవు రోజుల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్‌కు పంపించాలి. విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు సహకరించాలి. **–అబ్దుల్ కలాం, ఎంఈఓ**

నేడు ఇల్లూరు కొత్తపేటలో రెవెన్యూ సదస్సు

బనగానపల్లె: మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామంలో భూ సమస్యలు ఉన్న రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటుసారా స్వాధీనం

ప్యాపిలి: మండల పరిధిలోని గార్లదిన్నె సమీపంలో సుంకులమ్మ గుడి వద్ద మంగళవారం నాటుసారా విక్రయిస్తున్న వెంకటేశ్ నాయక్‌ను అరెస్టు చేసినట్లు జలదుర్గం ఎస్ఐ నాగార్జున తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బేతంచెర్లకు నీటి సరఫరా నిలిపివేత


ప్లాంట్ వద్ద మరమ్మతులు చేస్తున్న కార్మికులు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా వద్ద ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లో ఎలక్ట్రో మెకానికల్ మెయింటెన్స్ కారణంగా మంగళ, బుధవారం బేతంచెర్ల నగర పంచాయతీకి నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. 19వ తేది నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా కొనసాగుతుందన్నారు.

పప్పుశనగలో ఎండు తెగులును నివారించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నిరంజన్

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో విస్తారంగా సాగు చేసిన పప్పుశనగలో ఎండు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మంగళవారం మండలంలోని బిజనవేములలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. తుపాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలతో శనగపైరును ఎండు, మొదలు కుళ్లు, వేరుకుళ్లు తెగుళ్లు ఆశించాయన్నారు. ప్రస్తుతం వాతావరణం పొడిగా ఉండడంతో తెగులు వ్యాప్తి తగ్గుముఖం పట్టిందన్నారు. నివారణ చర్యగా పురుగు మందుల తోపాటు సాఫ్ పౌడర్ లేదా హెక్సకోనజోల్ మందులు కలిపి పిచికారీ చేయాలన్నారు. తెగులు సోకిన మొక్కలను పీకివేసి ఆ ప్రదేశంలో సాఫ్ పౌడర్ కలిపిన నీళ్లను భూమిలో పోయడం వల్ల తెగులు వ్యాప్తి తగ్గుతుందన్నారు. అర్హత ఉన్న కౌలు రైతులు బ్యాంకులను సంప్రదించి పంట రుణాలు పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. పశువైద్యాధికారి కృష్ణకుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకం


గుళ్లదూర్తిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఈఆర్ఓ

కోవెలకుంట్ల: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషిస్తుందని.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల అధికారి భూపాల్‌రెడ్డి అన్నారు. గత నెలలో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఓటు హక్కు నమోదు, ఫారం–7, ఫారం–8పై వచ్చిన దరఖాస్తులను మంగళవారం ఈఆర్ఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని గుళ్లదూర్తిలో దరఖాస్తుదారులను స్వయంగా కలిసి వివరాలు ఆరా తీశారు. అనంతరం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్ఐ పుల్లయ్య, వీఆర్ఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు


బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేస్తున్న సీఐ

కొలిమిగుండ్ల: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, జమ్మలమడుగు క్రాస్ రోడ్డులో డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తరచూ పరీక్షలు చేస్తామని చెప్పారు. అలాగే ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపరాదన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

అవుకు: దివ్యాంగుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని దివ్యాంగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. మంగళవారం అవుకు మండల పరిధిలోని రామాపురం గ్రామంలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు ఉన్న 22 డిమాండ్‌లలో రెండు మాత్రమే నెరవేర్చారని తెలిపారు. ఇందులో రూ.6వేల పింఛన్, త్రీవీలర్ స్కూటర్ అందాయన్నారు. మిగిలిన 20 డిమాండ్‌లను త్వరితగతిన నెరవార్చాలని కోరారు. ఈ నెల 21వ తేదీ బనగానపల్లె ఎంపీడీఓ కార్యాలయ భవనంలో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైద్యుడికి వీడ్కోలు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో ఆరేళ్లుగా వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న చరణ్ రాజ్ తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజీలో ఉన్నత చదువు కోసం వెళ్తున్నారు. మంగళవారం వైద్యురాలు సాగరిక, అబ్దుల్ అలీమ్, ఆరోగ్య సిబ్బంది, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీడ్కోల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన్ను సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వైద్యులు వాణిప్రియా, వంశీకృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మీ, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, రాజు, సభ్యులు వలీబాషా, మురళీకృష్ణ, ఉపేంద్ర పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి నంద్యాల పట్టణానికి చెందిన హేమ వినీష కుటుంబ సభ్యులు రూ.25 వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ మంగళవారం తెలిపారు. ఈ మేరకు దాతకు తీర్థ ప్రసాదాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, ఆలయ అర్చకులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

బనగానపల్లె రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం భానుముక్కల సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులకు సంబంధించి ఎలాంటి భూ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి 45 రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. సదస్సులో మొత్తం 12 మంది రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గీతాభవాని, వీఆర్వోలు ప్రసాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 10 దరఖాస్తులు

బేతంచెర్ల: పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ప్రకాశ్‌బాబు భూ సమస్యలపై రైతుల నుంచి 10 అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలు ఏకగ్రీవం

కోవెలకుంట్ల: స్థానిక ఎస్సార్బీసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. సంజామల మండలం ఆల్వకొండ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా ఇదే గ్రామానికి చెందిన విజయ్‌భరత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ముక్కమల్లకు చెందిన గరికె సుబ్బయ్యను ఎన్నుకున్నారు. అలాగే ఉయ్యాలవాడ మండలం మాయలూరు డిస్ట్రిబ్యూటరీకి సంబంధించి అధ్యక్షుడిగా అనంత రామసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం కొండసుంకేసులకు చెందిన వెంకటేశ్వరరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మినీ క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న వైద్య సిబ్బంది

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో మంగళవారం మినీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. వైద్యురాలు సాగరిక, వైద్య సిబ్బంది కేక్ కట్ చేశారు. వృత్తిని దైవంగా భావించి ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

ఎమ్మెల్యే కోట్లకు అస్వస్థత

డోన్ టౌన్: డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి అస్వస్థతకు గురైనట్లు సమాచారం. సోమవారం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది రావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు గౌరిగోపాల్ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేశారు. నిమోనియాతో బాధపడుతున్నట్లు గుర్తించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యం

బనగానపల్లె రూరల్: గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు గ్రామస్థాయిలో ఉండే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ట్రైనింగ్ ప్రోగ్రామ్ మేనేజర్, ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, వీఆర్‌వోలు, వెంటర్నరి అసిస్టెంట్స్, ఉద్యాన వనశాఖ అధికారులు, ఏఎన్ఎంలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. వారు మాట్లాడుతూ.. గ్రామాలు సుస్థిర అభివృద్ధి చెందాలంటే తొమ్మిది అంశాలను ప్రధానంగా తీసుకోవడం జరిగిందన్నారు. ఇది అమలు జరగాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్, డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి బాలాంజనేయులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపిస్తున్న సీఐ

డోన్ రూరల్: మండల పరిధిలోని కోట్లవారిపల్లె వద్ద మంగళవారం బైక్ దొంగలను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రాకేష్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా రావడాన్ని గుర్తించామన్నారు. వారిని విచారణ చేయగా బైక్ చోరీలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులు నంద్యాల శిల్పానగర్ కాలనీకి చెందిన పసుపుల దినేష్‌కుమార్, నంద్యాల టౌన్, నూతన్‌పేట కాలనీకి చెందిన షేక్ మహబూబ్‌బాషా అని వెల్లడించారు. వీరి నుంచి 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డోన్, పాణ్యం, నంద్యాల, అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో చోరీలు చేస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.


గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం

డోన్ టౌన్: దత్త జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దత్తాత్రేయస్వామి ఉత్సవమూర్తులకు ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణ సమీపంలోని గాయత్రీ పీఠంలో వెలసిన దత్తాత్రేయస్వామికి ఈ నెల 13వ తేదీ నుంచి ఉత్సవాలు జరిగాయి. చివరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో శతవధాని దత్తాత్రేయశర్మ, భక్తులు జొన్నలగడ్డ శ్రీధర్, కృష్ణవిలాస్ రవి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు.. అవిశ్రాంత సేవకులు


పెన్షనర్స్ డే కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీఎస్పీ, తదితరులు


రిటైర్డు ఉద్యోగి రాముడును సన్మానిస్తున్న పెన్షనర్లు

డోన్: ప్రజాసేవ చేసేందుకు పరితపించే అవిశ్రాంత సేవకులు రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగులని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. స్థానిక కార్యాలయంలో రాష్ట్ర పెన్షనర్స్ సంఘం కార్యదర్శి భానుసింగ్ అధ్యక్షతన మంగళవారం పెన్షనర్స్ డే నిర్వహించారు. డీఎస్పీతో పాటు గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ జయాదేవి, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ, సబ్‌ట్రెజరీ అధికారి రఘునందన్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఎంఈఓ ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ హరిక్రిష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ప్రజా సేవ చేయాలని పరితపించడం గొప్ప విషయమన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. సంఘం కార్యదర్శి గాలయ్య, సుబ్బరాయుడు, గౌరవ అధ్యక్షుడు హనీఫ్, లోకనాథరెడ్డి, రాందాస్‌రెడ్డి, దాసప్ప, కోశాధికారి గోపాల్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సంక్షేమానికి చొరవ చూపాలి

ప్యాపిలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సంక్షేమానికి చొరవ చూపాలని పెన్షనర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అనిమిరెడ్డి, అధ్యక్షుడు శివరామిరెడ్డి అన్నారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్ మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న డిసెంబర్ 17వ తేదీ ఏటా పెన్షనర్ల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 75 ఏళ్లు పైబడిన రిటైర్డు ఉద్యోగి రాముడును సన్మానించారు. పెన్షనర్లు ప్రభాకర్‌రావు, రంగన్న, నాగరాజు, రంగయ్యనాయుడు, మహమ్మద్ సాహెబ్, వెంకటమ్మ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎన్నో ఉపయోగాలు


మాట్లాడుతున్న ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి

డోన్ రూరల్: రైతులు భూసార పరీక్షలు చేసుకుని అందుకు అనుగుణంగా పంటల సాగుతో పాటు ఎరువులు వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయ సహాయ సంచాలకుడు పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని యు.కొత్తపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట మార్పిడి చేయడం వల్ల తెగుళ్లను నివారించవచ్చని పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పురుగు మందులు, రసాయన ఎరువులు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట ఏఓ అబ్దుల్ షఫీ, ఉద్యానశాఖ అధికారి కళ్యాణి, వ్యవసాయ సహాయకులు నరసింహ, జీవిత ఉన్నారు.

వృద్ధులకు బెడ్‌షీట్లు పంపిణీ

డోన్: ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పట్టణంలోని జంగాల కాలనీలో వృద్ధులకు కర్నూలుకు చెందిన డాక్టర్ తరుణ్, లీలా దంపతుల ఆర్థిక సహకారంతో బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన ప్రార్థన సమయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ వీటిని అందజేశారు.

అలాగే డోన్ డివిజన్ క్రిస్టియన్ జేఏసీ క్రైస్తవ గ్రంథాలయం నిర్వాహకులు మున్సిపల్ మహిళా కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

విద్యుత్ పొదుపుతో భవిష్యత్‌కు భరోసా


ఇంధన పొదుపు వారోత్సవాల్లో ఉద్యోగులు, కార్మికులు

డోన్ టౌన్: విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తేనే భవిష్యత్‌కు, బావితరాల వారికి భరోసా ఉంటుందని డోన్, బేతంచెర్ల, బనగానపల్లె విద్యుత్‌శాఖ డీఈలు నాగేంద్ర, మధుసూదనరెడ్డి, శ్రీనివాసులు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కార్యాలయం నుంచి కొత్తబస్టాండ్, పోలీస్‌స్టేషన్, అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నాణ్యమైన విద్యుత్ పరికరాలను ఉపయోగించాలని సూచించారు. సాధారణ బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులు ఉపయోగించాలని, అవసరం లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్లు, ఏసీల స్విచ్‌లు ఆఫ్ చేయాలన్నారు. ఫైవ్‌స్టార్, ఐఎస్ఐ మార్కు ఉన్న విద్యుత్ పరికరాలను వినియోగిస్తే కొంత వరకు విద్యుత్‌ను ఆదా చేయవచ్చని పేర్కొన్నారు. వీలైతే సోలార్ విద్యుత్‌ను వినియోగించే విధంగా చూసుకోవాలని సూచించారు. ఏఈలు నాగేశ్వరరెడ్డి, గజ్జప్ప, శ్రీనివాసులు, జేఈలు నాగరాజు, శివ పాల్గొన్నారు.